సాక్షి సూర్యాపేట

గురువారం ၊ 1 ၊ మే ၊ 2025

I



ఈఓగా బాధ్యతల స్వీకరణ
యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓగా వెంకట్రావ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.
- IIలో



ఎక్స్‌ప్లోజివ్స్ వద్ద ఉద్రిక్తత
కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ వద్ద మృతుల బంధువులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది.
- IIలో

గరిష్టం/కనిష్టం
42° /28°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన ఈఏపీ సెట్



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

అనంతగిరి: అనంతగిరి మండల కేంద్రంలో గల అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఏపీ సెట్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. రెండవ రోజు నిర్వహించిన పరీక్షకు 200 మంది అభ్యర్థులకు గాను 190మంది హాజరు కాగా 10మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సురేష్‌కుమార్ తెలిపారు.

జూన్ 3 నుంచి 13 వరకు పదో తరగతి సప్లిమెంటరీ

సూర్యాపేటటౌన్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు ఈ నెల 16వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించ్చని సూచించారు. రూ.50 అపరాద రుసుంతో ప్రతి పరీక్షకు రెండు రోజుల ముందు వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఒక్కో సబ్జెక్టుకు రూ.500 రుసుం చెల్లించి రీకౌంటింగ్ చేసుకోవచ్చని సూచించారు. రీ వెరిఫికేషన్ కోసం ఆన్సర్ బుక్‌కావాలిస్న విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాలని తెలిపారు. ఈ రుసుంను ఫలితాల నుంచి 15రోజుల్లోగా ట్రెజరీ చలాన్ ద్వారా చెల్లించాలని సూచించారు. చలానా, హాల్ టికెట్ కాపీ జత పరిచి ఆ దరఖాస్తులను సంబంధిత ప్రధానోపాధ్యాయులతో సంతకం చేయించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

నేటి నుంచి ఎంజీయూకు వేసవి సెలవులు

నల్లగొండ టూటౌన్: మహాత్మా గాంధీ యూనివర్సిటీలోని అన్ని కాలేజీలు, యూనివర్సిటీ పరిధిలోని పీజీ, బీఈడీ, ఎంఈడీ కాలేజీలకు గురువారం నుంచి ఈనెల 31 వరకు సెలవులు ప్రకటించినట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, డిగ్రీ కళాశాల యాజమాన్యాలు గమనించాలని కోరారు.

ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు

సూర్యాపేట : నీటి పారుదల శాఖ సూర్యాపేట సర్కిల్ ఈఈగా సూర్యాపేట డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్. వెంకట రమణకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

96.81 శాతం ఉత్తీర్ణత

6 నుంచి 14కు పడిపోయిన జిల్లా స్థానం

- బాలుర కంటే బాలికలదే పై చేయి
- గురుకుల పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత
- అత్యధికంగా మోడల్‌స్కూల్ విద్యార్థినికి 586మార్కులు






ఎం రితికారెడ్డి(586) | జె. ప్రవీణ్(578) | సీహెచ్ ఈశ్వర్(578) — ఇమాంపేట మోడల్ స్కూల్, సూర్యాపేట మండలం | స్నేహిత(580), మద్దిరాల గురుకుల పాఠశాల

సూర్యాపేట టౌన్: పదో తరగతి ఫలితాల్లో 96.81 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మెరుగైన ప్రతిభ కనబర్చినప్పటికీ రాష్ట్ర స్థాయిలో జిల్లా ర్యాంకు పడిపోయింది. గత ఏడాది 6వ స్థానంలో నిలువగా ఈ సారి 14వ స్థానానికి పడిపోయింది. బాలురకంటే బాలికలే పై చేయి సాధించారు.

11,508 మంది పాస్

జిల్లాలో మొత్తం 11,887 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 11,508 మంది పాసై 96.81శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 6,077 మంది పరీక్షలు రాయగా 5,845 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 5,810 మంది పరీక్షలు రాయగా 5,663 మంది ఉత్తీర్ణత సాధించి బాలుర కంటే బాలికలే పై చేయిగా నిలిచారు.

సత్తా చాటిన ప్రభుత్వ విద్యార్థులు..

సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎయిడెడ్ పాఠశాలల్లో 93.75శాతం ఉత్తీర్ణత సాధించగా ఆశ్రమ పాఠశాలలో 98.65శాతం, బీసీ వెల్ఫేర్ పాఠశాలలో 99.61శాతం, ప్రభుత్వ పాఠశాలల్లో 85.76 శాతం, కేజీబీవీలలో 97.29శాతం, మోడల్ స్కూల్స్‌లో 97.16శాతం, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 100శాతం, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 98.69 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 96.88 శాతం, జిల్లా పరిషత్ పాఠశాలలో 94.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ పాఠశాలల్లో 98.62శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

గత ఏడాది కంటే తగ్గిన జిల్లా ర్యాంకు..

గత ఏడాది 11,910 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 11,542 మంది విద్యార్థులు పాసై 96.91శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా 6వ స్థానంలో నిలిచింది. అయితే ఈ ఏడాది మొత్తం 11,887 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 11,508 మంది విద్యార్థులు పాసై 96.81శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా 14వ స్థానంలో నిలిచింది. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినప్పటికీ ర్యాంకు తగ్గింది.

వందశాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ విద్యాసంస్థలు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలు 85, మోడల్ స్కూల్స్ రెండు, కేజీబీవీ 10, తెలంగాణ రెసిడెన్షియల్ ఒకటి, ఆశ్రమ పాఠశాలలు 12, మైనార్టీ రెసిడెన్షియల్స్ రెండు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ నాలుగు పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.



మాట్లాడుతున్న పీసీసీ పరిశీలకుడు డాక్టర్ మురళీనాయక్, చిత్రంలో శత్రు బిజ్జి, వెంకన్న, రమేష్‌రెడ్డి

'స్థానిక'ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పీసీసీ పరిశీలకులు డాక్టర్ మురళీనాయక్, శత్రు బిజ్జి

భానుపురి (సూర్యాపేట) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పీసీసీ పరిశీలకులు డాక్టర్ మురళీనాయక్, శత్రు బిజ్జిలు పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలని, పాత, కొత్త నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. గత పదేళ్ల కాలంలో ప్రజల కోసం బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదని, ఈ విషయాన్ని ఇంటింటికీ వెళ్లి కార్యకర్తలు వివరించాలన్నారు. సమావేశంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కార్పొరేషన్ల చైర్మన్లు పటేల్ రమేష్‌రెడ్డి, నాయుడు సత్యనారాయణ, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు.

ఆటలు నేర్చుకుందామా..

నేటి నుంచి జూన్ 6వరకు విద్యార్థులకు వేసవి క్రీడల శిక్షణ

- జిల్లాలో 14 చోట్ల శిబిరాలు
- 14ఏళ్లలోపు బాలబాలికలకు అవకాశం

హుజూర్‌నగర్ : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చిన్నారుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించి వారిని మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, యువజన క్రీడా సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో మే 1 నుంచి జూన్ 6 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల్లో అర్హులైన వారిని శిక్షకులు (కోచ్‌లు)గా ఎంపిక చేశారు. వీరి ఆధ్వర్యంలో చిన్నారులకు ఈ వేసవిలో నెల రోజుల పాటు క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

క్రీడాకారుల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు

శిబిరాలకు వచ్చే విద్యార్థుల వివరాలు గతంలో శిక్షకుల వద్ద నమోదు చేసుకునే వారు. వీరికి ప్రత్యేక హాజరు రిజిస్టర్ నిర్వహించేవారు. అయితే ఈఏడాది నుంచి క్రీడాకారుల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. మే 5వ తేదీ లోపల ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనిపై ఇటీవల శిక్షకులకు అవగాహన సదస్సు కూడా ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ శిబిరాల్లో ప్రతిభా నైపుణ్యాలు ప్రదర్శించిన క్రీడాకారులను మరింత ప్రోత్సహిస్తారు. అంతేకాకుండా వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎంపిక చేసే అవకాశం కూడా ఉంటుంది.

దాతలు సహకారం అందిస్తే మరింత ప్రయోజనం

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్థానికంగా ఉండే దాతలు స్పందించి తమవంతు సహాయ సహకారలు అందిస్తే మరింత ప్రయోజనం కలుగుతుంది. నెల రోజుల పాటు జరిగే శిబిరంలో వారానికి ఒకసారి పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక పోటీలు నిర్వహించి బహుమతులు అందించాలి. క్రీడాకారులకు క్రీడా పరికరాలు, ప్రత్యేక క్రీడాదుస్తులు సమకూరిస్తే మరింత మంది చిన్నారులు, యువకులు ఎక్కువగా మైదానాల బాట పట్టే అవకాశం ఉంటుంది.



జిల్లాలో 14చోట్ల శిక్షణ శిబిరాలు

ఈ సారి గ్రామీణ ప్రాంతాల్లో 10 చోట్ల, పట్టణ ప్రాంతాల్లో 4 చోట్ల వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. వాటిలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలైన తుంగతుర్తి మండలం వెంపటి, చిలుకూరు, నడిగూడెంలలో కబడ్డీ శిక్షణ శిబిరాలు, కోదాడ మండలం కూచిపూడి, సూర్యాపేట మండలం యడ్లపల్లిలో ఖోఖో, కోదాడ మండలం కొమరబండ, గుడిబండ, చిలుకూరు మండలం పాలెఅన్నారం, మేళ్లచెరువు, అర్వపల్లిలో వాలీబాల్ క్రీడల శిక్షణ శిబిరాలు నిర్వహించ నున్నారు. పట్టణ ప్రాంతాలైన సూర్యాపేట పరిధిలోని పిల్లలమర్రిలో అథ్లెటిక్స్, టేకుమట్లలో బాస్కెట్‌బాల్, కోదాడ పరిధిలోని కేఆర్ఆర్ డిగ్రీ కాలేజీలో బాస్కెట్‌బాల్, కొమరబండలో వాలీబాల్ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రీడల్లో పాల్గొనేందుకు 14 ఏళ్లలోపు బాలబాలికలు అర్హులు. వారికి రోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఆయా క్రీడల్లో శిక్షణ ఉంటుంది. ఇప్పటికే ఆయా చోట్ల క్రీడా మైదానాలు సిద్ధమయ్యాయి.

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



శిబిరాల నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. సంబంధిత క్రీడాంశాలకు సంబంధించిన సామగ్రిని అందిస్తాం. శిబిరాల్లో తాగునీటి వసతి, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచుతాం. గ్రామీణ క్రీడాకారులు శిబిరాలను సద్వినియోగం చేసుకొని క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి. ఆయా క్రీడల్లో మరింతగా రాణించాలి

–జి రాంచందర్‌రావు, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి, సూర్యాపేట

భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మేళ్లచెరువు : భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతిచట్టం -2025 అవగాహన సదస్సును అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ధరణితో రైతుల సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొన్నారని దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసి 18 రాష్ట్రాల్లో నిపుణులు, మేధావులు, అధికారుల సూచనలు తీసుకొని భూభారతిచట్టం తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతి మనిషికి ఆధార్‌నంబర్ ఉన్నట్లుగానే ప్రతి కమతానికి భూధార్ నంబర్ కేటాయిస్తామన్నారు. రైతుల భూమికి హద్దులతో కూడిన మ్యాప్ రూపొందించి ఇస్తామన్నారు. ఫౌతి చేసేటప్పుడు కుటుంబ సభ్యులకు నోటీసు ఇచ్చి తదనంతరం రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. గతంలో చేసిన మ్యుటేషన్లపై అప్పీల్ చేసుకునేందుకు ధరణిలో అవకాశం లేదని కానీ భూభారతిలో ఎటువంటి అభ్యంతరం ఉన్నా తహసీల్దార్, ఆర్‌డీఓ, కలెక్టర్‌ల వద్ద పరిష్కారం చేసుకోవచ్చని లేని పక్షంలో అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించడం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు , మహిళా రైతులకు ఉచితంగా న్యాయ సలహాలు అందించనున్నట్లు తెలిపారు. త్వరలో గ్రామ పాలన అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో హుజూర్‌నగర్ ఆర్‌డీఓ శ్రీనివాసులు,ఎ మండల ప్రత్యేక అధికారి పద్మ, తహసీల్దార్ జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికదేశ్‌ముఖ్, ఎస్‌ఐ పరమేష్, కాకునూరి భాస్కరరెడ్డి, కొట్టె సైదేశ్వరరావు, రామచంద్రయ్య, గంగయ్య, సుధాకర్‌నాయక్ పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి భూభారతి సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

యువత చెడుమార్గంలో పయనించవద్దు : ఎస్పీ

నూతనకల్: సమాజంలో యువత చెడుమార్గంలో పయనించవద్దని ఎస్పీ నర్సింహ సూచించారు. బుధవారం నూతనకల్ మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో నిర్వహించిన పోలీసు ప్రజాభరోసా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమాజంలో ఉన్నతమైన వారిగా గుర్తింపు పొందడానికి విద్యే ప్రధానమని అన్నారు. కష్టపడి చదువుతూ లక్ష్యాలను సాధించాలని ఆయన కోరారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొన్నప్పుడే అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. సైబర్ మోసాలు, రోడ్డు భద్రత విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి, సీఐ నర్సింహారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణ్‌రావు, ఏఎస్‌ఐ కోమటిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి మహాక్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని వేదపండితులు బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్యకల్యాణంలో భాగంగా ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చలు చేశారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రసరమ్యంగా రక్తికట్టించారు. అనంతరం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణ తంతును వైభవంగా నిర్వహించారు. తదనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహా నివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనర్సింహమూర్తి, భక్తులు పాల్గొన్నారు.



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

పట్టుకున్నారు.. వదిలేశారు..!

మట్టి మాఫియాకు రాజకీయ నేతల అండదండలు

- అనుమతి పత్రాలను ఫోర్జరీ చేసినా కేసు నమోదు చేయని అధికారులు
- రూ. 75 వేల జరిమానాతోనే సరి
- ఫిర్యాదు అందలేదంటున్న పోలీసులు



అక్రమంగా మట్టిని తవ్వుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న మైనింగ్‌శాఖ అధికారులు (ఫైల్)

కోదాడ : కోదాడ కేంద్రంగా సాగుతున్న మట్టి మాఫియా కొత్త పుంతలు తొక్కుతోంది. ఏకంగా జిల్లా అధికారులు ఇచ్చిన అనుమతి పత్రాలనే ఫోర్జరీ చేసి ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా లక్షలు విలువైన మట్టిని రాత్రి పగలు అనే తేడా లేకుండా మూడు నెలలుగా తరలించుకుపోతోంది. అయితే మట్టి మాఫియాపై ఫిర్యాదులు రావడంతో జిల్లా మైనింగ్ శాఖ అధికారులు నాలుగు రోజుల క్రితం ఆకస్మికదాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా ఒక ప్రొక్లెయిన్, ఐదు ట్రిప్పర్లను పట్టుకున్నారు. ఈ సమయంలో తాము అనుమతి ఇచ్చిన పత్రాలను ఫోర్జరీ చేసి తేదీలను మార్చివేసి రెండు నెలలకు పైగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, కేసులు పెడతామని చెప్పారు. కానీ ఏమైందో ఏమోగాని సదరు మట్టి దందారాయుళ్లపై కనీసం పిటీ కేసు పెట్టకుండా నామమాత్రపు జరిమానాతో అధికారులు వదిలేశారు.

మైనింగ్‌శాఖ ఉత్తర్వులనే మార్చారు

కోదాడ మండల పరిధిలోని కూచిపూడి వద్ద సర్వేనంబర్ 615లో ఉన్న ప్రభుత్వ భూమిలో తాత్కాలిక మైనింగ్ చేసుకొని 1000 మెట్రిక్ టన్నుల మట్టిని తవ్వడానికి సీహెచ్. వెంకయ్య అండ్ కంపెనీకి జిల్లా మైనింగ్‌శాఖ అధికారులు జనవరి 16న అనుమతిని మంజూరు చేశారు. దీన్ని వీరు 2025 జనవరి 16 నుంచి 2025 ఫిబ్రవరి 4 మధ్యలోనే తవ్వుకోవాల్సి ఉంటుంది. దీని కోసం వీరు ప్రభుత్వానికి రూ.2 లక్షల రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇంత వరకు బాగానే ఉన్నా మట్టిదందా చేసేవారు మైనింగ్ శాఖ ఇచ్చిన అనుమతి పత్రాలలోని తేదీలను మార్చి అధికారి సంతకంతో ఫోర్జరీ పత్రాలను సృష్టించారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 04 వరకు ఉన్న అనుమతిని జనవరి16 నుంచి జూన్ 04 వరకు అంటే అదనంగా నాలుగు నెలల పాటు వారే పొడిగించుకున్నారు. ఈ అనుమతి పత్రాలను చూపుతూ యథేచ్ఛగా మట్టిని వెంచర్లకు తరలించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు.

రెండున్నర నెలల తరువాత..

కూచిపూడి వద్ద ప్రభుత్వ భూమిలో అక్రమంగా మైనింగ్ జరుగుతున్న విషయాన్ని స్థానికులు అనేకసార్లు ఫిర్యాదు చేసినా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అది తమపని కాదంటే తమ పని కాదని ఆయాశాఖల అధికారులు ఒకరిపై ఒకరు చెబుతూ వస్తున్నారు. మట్టితోలకం అనుమతి ఫిబ్రవరి 4నే ముగిసింది.గడువు ముగిసిన రెండున్నర నెలల తరువాత అధికారులు కళ్లుతెరిచి ఈనెల 25న మైనింగ్‌శాఖ ఇన్‌చార్జి ఏడీ విజయ రామరాజు ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. తమ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను ఫోర్జరీ చేసిన విషయాన్ని గుర్తించారు. సంఘటనా స్థలంలో ఉన్న ప్రొక్లెయిన్, ఐదు ట్రిప్పర్లను సీజ్ చేశారు. తమ ఉత్తర్వులను ఫోర్జరీ చేయడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణించి కోదాడ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి మైనింగ్‌శాఖ అధికారులు వచ్చారు. మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు మంతనాలు జరిపి ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.


రెండు నెలల 20 రోజులకు రూ. 75 వేలు

తమ సంతకాలను ఫోర్జరీ చేయడాన్ని తీవ్ర నేరంగా పరిగణించి క్రిమినల్ కేసులు నమోదు చేయించాల్సిన మైనింగ్‌శాఖ అధికారులు కాసులకు కక్కుర్తిపడి మైనింగ్ మాఫియాతో కుమ్మక్కైయినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 20 రోజుల పాటు మట్టి తవ్వకానికి అనుమతించిన అధికారులు దాని కోసం రూ. 2 లక్షలు వసూలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించి, అధికారుల ఉత్తర్వులు ఫోర్జరీ చేసి రెండు నెలల 20 రోజుల పాటు అక్రమంగా మట్టిని తరలించిన వారికి అధికారులు వేసిన ఫైన్ కేవలం రూ.75 వేలు మాత్రమే. నిబంధనల ప్రకారం దాదాపు రూ.10 లక్షల జరిమానా విధించవచ్చు. కానీ ప్రొక్లెయిన్‌కు రూ. 50 వేలు, ఐదు టిప్పర్లకు కలిపిరూ. 25 వేలు ఫైన్ మాత్రమే వేశారు. మైనింగ్‌శాఖ అధికారులు ఫిర్యాదు చేయలేదు కాబట్టి పోలీసులు కేసునమోదు చేయలేదని చెబుతున్నారు.


ఫిర్యాదు చేయలేదు.. ఫైన్ వేశారు

మైనింగ్‌శాఖ అధికారులు మట్టి తవ్వకాలపై మాకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. పట్టుకున్న వాహనాలలో ప్రొక్లెయిన్‌కు రూ.50 వేలు, ఐదు టిప్పర్లకు రూ.25 వేలు జరిమానా విధించారు.

– అనిల్‌రెడ్డి, కోదాడ రూరల్ ఎస్‌ఐ



మైనింగ్ శాఖ అధికారులు జనవరి 16నుంచి ఫిబ్రవరి 4 వరకు ఇచ్చిన అనుమతి పత్రం



జనవరి 16 నుంచి జూన్ 4 వరకు అనుమతి ఉన్నట్లు ఫోర్జరీ చేసిన పత్రం

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్
- భూమి అక్రమపట్టాపై విచారణ అధికారిగా అదనపు కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ హెచ్చరించారు. ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్ శివారులో వివాదాస్పద భూమిని అక్రమంగా పట్టా చేసిన విషయమై 'రెవెన్యూ లీలలు' శీర్షికన ఈనెల 24వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ పి.రాంబాబును నియమించారు. వివాదాస్పద భూమి పట్టా విషయం, మండల రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగుల పనితీరుపై విచారణ నిర్వహించి పూర్తి నివేదికను తక్షణమే అందించాలని ఆయన ఆదేశించారు.

క్లుప్తంగా

జీవితంపై విరక్తితో బిల్డర్ ఆత్మహత్య

నల్లగొండ: వ్యాపారంలో నష్టాలు రావడంతో జీవితంపై విరక్తితో బిల్డర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. అమ్మనబోలు మండలం బెండలపహాడ్ గ్రామానికి చెందిన జిల్లా యాదగిరి(45) నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని రాక్‌హిల్స్ కాలనీలో నివాసముంటూ బిల్డర్‌గా పనిచేస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో యాదగిరి మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో అతడు బుధవారం రాక్‌హిల్స్ కాలనీ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ సైదులు తెలిపారు.

విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కు గాయాలు



కానిస్టేబుల్ మురళిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న తోటి ఉద్యోగులు

భువనగిరిటౌన్: ట్రాఫిక్ మళ్లిస్తున్న కానిస్టేబుల్ కాలు పైనుంచి గూడ్స్ వాహనం వెళ్లడంతో గాయపడ్డాడు. ఈ ఘటన బుధవారం భువనగిరి పట్టణంలో జరిగింది. భువనగిరి పట్టణంలోని గంజ్ మార్కెట్ యార్డులో బుధవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ వాహనాలు వెళ్తుండడంతో భువనగిరి పట్టణానికి చెందిన కానిస్టేబుల్ మురళి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న క్రమంలో అతడి కాలు పైనుంచి గూడ్స్ వాహనం వెళ్లింది. దీంతో కానిస్టేబుల్ మురళి కిందపడిపోవడంతో స్థానికులు అతడిని పైకి లేపి పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసు వాహనంలో మురళిని ఆస్పత్రికి తరలించారు.

పిడుగుపాటుతో రెండు ఎద్దులు, గేదె మృతి

డిండి: డిండి మండల కేంద్రానికి చెందిన బద్దెల బచ్చలు తన వ్యవసాయ పొలం వద్ద గేదెను కట్టేయగా.. బుధవారం కురిసిన వర్షానికి పిడుగుపడి గేదె మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. అదేవిధంగా బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జబ్బు పెద్దయ్య వ్యవసాయ పొలంలో పిడుగు పడడంతో సుమారు రూ.1.20 లక్షల విలువ చేసే రెండు ఎద్దులు మృతిచెందాయి.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు..

నడిగూడెం: కుక్కల దాడిలో 31 గొర్రె పిల్లలు మృతిచెందాయి. ఈ ఘటన బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన ఒట్టి సతీష్ తన గొర్రెలను మేత కోసం శివారు ప్రాంతానికి తోలుకెళ్లాడు. ఈ క్రమంలో గొర్రె పిల్లలను ఇంటి వద్దే ఉంచగా.. వాటిపై కుక్కలు దాడి చేయడంతో 31 గొర్రె పిల్లలు మృతి చెందాయి. మృతిచెందిన గొర్రె పిల్లల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ఒంటిపై పెట్రోల్ పోసుకుని వ్యక్తి హల్‌చల్

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ రాక ముందే గుడిమల్కాపురం గ్రామానికి చెందిన రైతు దొంగరి నాగరాజు వచ్చి తమకు దొండపాడు శివారులోని 187, 200 సర్వే నంబర్లలో ఉన్న భూ సమస్యలు పరిష్కారం కావడంలేదని ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిరసన తెలిపాడు. పోలీసులు, స్థానికులు అతడిని సముదాయించారు. అనంతరం సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చిందని కలెక్టర్ అన్నారు.

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ వద్ద ఉద్రిక్తత

- న్యాయం చేయాలని బాధితుల కుటుంబ సభ్యుల ఆందోళన
- మృతుల కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.కోటి ఇస్తామని యాజమాన్యం హామీ
- క్షతగాత్రులకు రూ.5లక్షల ఆర్థికసాయం



కాటేపల్లి గ్రామంలోని ప్రధాన రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

మోటకొండూర్: మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో మంగళవారం సాయంత్రం రియాక్టర్ పేలి ముగ్గురు మృతిచెందగా.. ఆరుగురికి తీవ్రంగా గాయపడ్డారు. తమకు న్యాయం చేయాలని మృతులు, గాయపడిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో బుధవారం ఉదయం పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. కాటేపల్లి ప్రధాన రోడ్డు పక్కన టెంట్ వేసుకుని ఆందోళనకు దిగారు. నాలుగు గంటల పాటు మోత్కూరు–రాయిగిరి రోడ్డును దిగ్బంధించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. బాధిత కుటుంబాలను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి వేర్వేరుగా వచ్చి పరామర్శించారు. తగిన న్యాయం చేయటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కంపెనీలో పేలుడు సంభవించిన స్థలాన్ని పరిశీలించారు.



ఘటనా స్థలిలో మృతుడి మాంసం ముద్ద

మృతులకు రూ.కోటి నష్టపరిహారం..

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ యాజమాన్యంతో భువనగిరిలోని ఓ హోటల్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూర్ అశోక్, పలువురు నాయకులు చర్చలు జరిపారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం మృతుల కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.కోటి నష్టపరిహారంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా రూ.50లక్షలు, మిగతా రూ.50లక్షలు తర్వాత చెల్లిస్తామని ఒప్పుకున్నారు. గాయపడిన వారికి తక్షణ సహాయం కింద రూ.5లక్షల ఆర్థిక సాయంతో పాటు ఆస్పత్రి ఖర్చులు భరిస్తామని, తిరిగి వారు పనిలో చేరేవరకు పూర్తి జీతం, అంగవైకల్యం సంభవిస్తే తగిన న్యాయం చేస్తామని ఒప్పుకున్నారు. దీంతో ఆందోళన విరమించారు.

నరేష్ అంత్యక్రియలు పూర్తి

ఆత్మకూరు(ఎం): ఈ ఘటనలో మృతిచెందిన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన కల్వల నరేష్(32) అంత్యక్రియలను మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నరేష్ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అంత్యక్రియలో పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండు మృతదేహాల వెలికితీత..

రియాక్టర్ పేలుడు ధాటికి మాంసం ముద్దలుగా మారి శిథిలాల కింద చిక్కుకున్న మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన చెన్నోజి దేవిచరణ్, కాటేపల్లి గ్రామానికి చెందిన గుసుగుంట్ల సందీప్ మృతదేహాలను బుధవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో పోలీసులు వెలికితీసి భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సందీప్ తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రొడక్షన్ మేనేజర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల ఉపేందర్ తెలిపారు.

కడసారి చూపు కరువైంది

తన కుమారుడి కడసారి చూపు కూడా కరువైందని గుసుగుంట్ల సందీప్ తల్లి మంగమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. తన భర్త కొన్నేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుని తనను ఒంటరి చేస్తే.. ఇప్పుడు చేతికందొచ్చిన కుమారుడు మాంసపు ముద్దగా తిరిగి రావడంతో పుత్రశోకంతో ఆమె విలపిస్తున్న తీరు కాటేపల్లి గ్రామస్తులను కలచివేసింది. కంపెనీ మొదలుపెట్టినప్పుడు రోజుకు రూ.300కు కూలీకి వెళ్లిన సందీప్.. ఆ తర్వాత మంచి పేరు సంపాదించుకుని పర్మినెంట్ జాబ్ సంపాదించడంతో ఇంటిల్లిపాది సంబరపడ్డామని, కానీ పనిచేస్తూనే కానరాని లోకాలకు వెళ్తాడని ఊహించలేదని మంగమ్మ రోదించిన తీరు కలచివేసింది. పెళ్లైన మూడు నెలలకే భర్త చనిపోవడంతో సందీప్ భార్య రోదనలు మిన్నంటాయి.

ఎవరి కోసం బతకాలి బిడ్డా..

దేవిచరణ్ మృతితో తాను ఎవరి కోసం బతకాలని అంటూ అతడి తల్లి బుజ్జమ్మ రోదించిన తీరు కలచివేసింది. భర్త చనిపోవడంతో మిషన్ కుడుతూ ఒక్కగానొక్క కుమారుడిని చదివించానని, తన కష్టం చూడలేక ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో పనిలోకి చేరాడని, సంవత్సరం గడవక ముందే తిరిగిరాని లోకాలకు వెళ్లాడని భువనగిరి ఏరియా ఆస్పత్రి వద్ద దేవిచరణ్ మృతదేహాన్ని చూసి బుజ్జమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది.

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు సీసీ లైనింగ్

- రూ.442 కోట్ల నిధులతో పరిపాలనా అనుమతులు
- ఉత్తర్వులు జారీ చేసిన నీటిపారుదల శాఖ
- త్వరలోనే టెండర్లకు ఆహ్వానం
- సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి



గుర్రంపోడు వద్ద దెబ్బతిన్న ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్

నల్లగొండ, గుర్రంపోడు: ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) ప్రధాన కాల్వ సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.442 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి పరిపాలనా అనుమతులు సైతం ఇస్తూ బుధవారం నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 23.500 కిలోమీటర్ల నుంచి మూసీ వరకు గల 136.150 కిలోమీటర్ల లైనింగ్‌కు 113 కిలోమీటర్ల మేర కాల్వ సిమెంట్ కాంక్రీట్ చేయనున్నారు. ఇటీవలే అధికారులు ప్రతిపాదనలు పంపించగా ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేస్తూ తాజాగా పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తయితే నేరుగా కృష్ణాజలాలు అందే 23వ కిలోమీటర్ కామన్ పాయింట్ నుంచి ప్రధాన కాల్వకు సీసీ లైనింగ్ పనులు మొదలవుతాయి. బిడ్‌లుగా విభజించి త్వరలో టెండర్లు పిలువనున్నారు. కాల్వకు నీటి విడుదల జరగని జూలైలోగా కాల్వ సీసీ లైనింగ్ పనులు చేపట్టేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఎట్టకేలకు సీసీ లైనింగ్ ..

1984లో తవ్విన ప్రధాన కాల్వకు దశాబ్దాలు గడిచినా కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో కాల్వగట్టు శిథిలమై నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోయింది. 3వేల క్యూసెక్కుల సామర్థ్యం గల ప్రధాన కాల్వలో 1,200 క్యూసెక్కుల నీటి ప్రవాహ కొనసాగుతుండగా మధ్యలోనే లీకేజీలతో చివరకు నీరు చేరే సరికి సగానికి తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటనే లైనింగ్ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు విన్నవించారు. దీంతో ఎట్టకేలకు లైనింగ్ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. లైనింగ్ పూర్తయితే 3వేల క్యూసెక్కుల నీటితో 1.5 టీఎంసీల నీటి సామర్థ్యం పానగల్ రిజర్వాయర్‌ను నిండడానికి పది, పదిహేను రోజులే పట్టనుంది. ప్రధాన కాల్వ సీసీ లైనింగ్ వల్ల సుమారు 2.20లక్షల ఎకరాల్లోని ఏఎమ్మార్పీ ఆయకట్టు చివరి భూములకు కూడా సాగు నీరందుతుందని అధికారులు భావిస్తున్నారు. నిధులు మంజూరు చేస్తూ పాలనా ఉత్తర్వులు ఇచ్చినందుకు గాను సీఎం అనుముల రేవంత్‌రెడ్డితో పాటు నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు తప్పదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



గట్టుప్పల్: అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

గట్టుప్పల్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించే ప్రభుత్వాలపై తిరుగుబాటు తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో బుధవారం జరిగిన అమరవీరుల సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెట్టుబడిదారులు, భూ స్వాములకు ప్రభుత్వాలు వత్తాసు పలుకుతు న్నాయన్నారు. కూలీలు, కార్మికుల హక్కుల కోసం ఎర్రజెండా అలుపులేకుండా పోరాడుతోందన్నారు. ఈ భూ ప్రపంచం ఉన్నంత వరకూ ఎర్రజెండాను అంతం చేయడం ఎవ్వరి తరం కాదన్నారు. మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడతోందని విమర్శించారు. మే 1 నుంచి 8వ తేదీ వరకు కార్మిక వారోత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. అంతకుముందు అమరవీరుల చిత్రపటాలకు పార్టీ నాయకులు కలిసి నివాళులు అర్పించారు. జాన్‌వెస్లీ రాక సందర్భంగా గట్టుప్పల్‌లో నిర్వహించిన ర్యాలీలో కళాకారుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. ఆ పార్టీ మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు కట్ట నర్సింహ, సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, బండ శ్రీశైలం, చాపల మారయ్య, శంకర్, నాంపల్లి చంద్రమౌళి, రవీందర్‌రెడ్డి, కర్నాటి సుధాకర్, పెద్దులు, దోనూరి నర్సిరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

సంస్థాన్ నారాయణపురం: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో వెంటనే శాంతియుతంగా చర్చలు జరపాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సంస్థాన్ నారాయణపురంలో విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో కర్రి గుట్టల్లో ఆదివాసీలను చుట్టుముట్టి చంపుతున్నారని, కర్రిగుట్టల్లో సహజ ఖనిజాలు పెద్ద ఎత్తున ఉన్నాయని, వాటిని ప్రైవేట్ వారికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందనే నివేదికను బహిర్గతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల మీద పెట్టే శ్రద్ధ ప్రజాసమస్యల పరిష్కారంపై పెట్టాలన్నారు. ఆయన వెంట సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఉన్నారు. అంతకుముందు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్ నల్లగొండ జిల్లా పరిశీలకుడు, మక్తల్ ఎమ్మెల్యే వాకటి శ్రీహరి



మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తదితరులు

నల్లగొండ: రాష్ట్రంలోని పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మక్తల్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా పరిశీలకుడు వాకటి శ్రీహరి అన్నారు. బుధవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సమస్యలను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వారికే రానున్న ఎన్నికల్లో, ఇతర పదవుల్లోనూ అవకాశాలు లభిస్తాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నలగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు జూకూరి రమేష్, అంకతి సత్యం, మహిళా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 14 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

నల్లగొండ: బైక్‌లు చోరీ చేస్తున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను బుధవారం వాడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి 14 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా చిలుకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన నలమాల ఎర్రబ్బాయి అలియాస్ లూథర్, అదే గ్రామానికి చెందిన గంజి అంకమరావు, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపహాడ్ గ్రామానికి చెందిన వట్టిపల్లి శ్రీకాంత్ ముఠాగా ఏర్పడి బైక్‌లు చోరీ చేసి వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. నలమాద ఎర్రబాబు తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ, దామరచర్ల, నార్కట్‌పల్లి, ఇబ్రహీంపట్నంతో పాటు ఏపీలోని మార్టూరు, పొన్నూరులో ప్రభుత్వ కార్యాలయాలు, హోటళ్లు, వైన్స్‌లు, రాత్రివేళ ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేసి వాటిని గంజి అంకమరావు, మట్టిపల్లి శ్రీకాంత్‌తో కలిసి తక్కువ ధరకు విక్రయించేవాడు. బుధవారం ఉదయం వాడపల్లి ఎస్ఐ తన సిబ్బందితో కలిసి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎర్రబ్బాయి, అంకమరావు చోరీ చేసిన బైక్‌లను అమ్మడానికి దామరచర్ల నుంచి గుంటూరు వైపు వెళ్తుండగా.. అనుమానం వచ్చి ఎస్ఐ వారిని పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు మట్టిపల్లి శ్రీకాంత్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఏడు పల్సర్ బైక్‌లు, ఒక షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.26.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ముగ్గురు నిందితులపై వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో 3, నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో ఒక్కోటి చొప్పున, నార్కట్‌పల్లి పీఎస్‌లో 2, ఇబ్రహీంపట్నం పీఎస్‌లో 1, ఏపీలోని మార్టూర్ పీఎస్‌లో 2, పొన్నూరు పీఎస్‌లో 1, రాజమండ్రిలో 1 కేసు నమోదైనట్లు ఎస్పీ పేర్కొన్నారు. మొత్తం 22 బైక్‌లు దొంగిలించినట్లుగా నిందితులు అంగీకరించారని, మిగతా వాహనాలను కూడా స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ తెలిపారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో ఈ కేసును ఛేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, సీసీఎస్ సీఐ డానియేల్, వాడపల్లి ఎస్ఐ ఎ. శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది సతీష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, రషీద్, సీసీఎస్ సిబ్బంది విష్ణువర్ధనగిరి, రాంప్రసాద్, పుష్పగిరి, శ్రీనివాస్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

‘పది’లో జయ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న జయ స్కూల్ యాజమాన్యం

సూర్యాపేటటౌన్: పదో తరగతి ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు 587 మార్కులు, 15 మంది విద్యార్థులు 580పైగా మార్కులు, 52 మంది విద్యార్థులు 570పైగా మార్కులు, 106 మంది విద్యార్థులు 560 పైగా, 154 మంది విద్యార్థులు 550పైగా మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ తెలిపారు. వి. హాసిని, కె. శ్రేష్ఠ, ఎం. అనన్య, ఎం. శ్రీదేవి 587 మార్కులు, కె. శరణ్య 586 మార్కులు, లోకేష్ 585, సాయి చర్విత, శ్రీజ 584 మార్కులు, చాణక్య, హర్షవర్ధని 583 మార్కులు, రేవంత్‌రెడ్డి, మన్విత, ప్రగతి, వేద 580 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, డైరెక్టర్లు అభినందించారు.

గుట్ట ఈఓగా వెంకట్రావ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన ఈఓగా వెంకట్రావ్ (ఐఏఎస్) బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా వెంకట్రావ్‌ను దేవాదాయశాఖ డైరెక్టర్‌గా నియమించిన రాష్ట్ర ప్రభుత్వం.. అదనంగా యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓగా బాధ్యతలు అప్పగించింది. బుధవారం సాయంత్రం గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకున్న అనంతరం ఈఓ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆలయ రికార్డులను, పత్రాలను బదిలీ అయిన భాస్కర్‌రావు నూతన ఈఓకు అప్పగించారు. నూతన ఈఓ, బదిలీపై వెళ్తున్న భాస్కర్‌రావును అర్చకులు, ఆలయ ఉద్యోగులు సన్మానించారు. అనంతరం నూతన ఈఓ క్యూలైన్‌లో నిల్చున్న భక్తులను పలకరించారు. దర్శనానికి ఎక్కడి నుంచి వచ్చారు, క్యూలైన్లలో ఎలా ఉందని తెలుసుకున్నారు. అలాగే పెండింగ్ పనులు, నూతన నిర్మాణాలు, పూజలకు సంబంధించిన అంశాలను అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, పాత ఈఓ భాస్కర్‌రావు, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా భాస్కర్‌రావుకు ప్రభుత్వం ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు.

ఏదుళ్ల మధుసూదన్‌రెడ్డికి ఘన సన్మానం



ఏదుళ్ల మధుసూదన్‌రెడ్డికి సన్మాన పత్రం అందజేస్తున్న డీఈఓ భిక్షపతి తదితరులు

నల్లగొండ: డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తూ బుధవారం పదవీ విరమణ పొందిన ఏదుళ్ల మధుసూదన్‌రెడ్డిని డీఈఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు డీఈఓ భిక్షపతి సన్మాన పత్రం అందజేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పీఏగానూ సేవలు అందించిన ఏదుళ్ల మధుసూదన్ రెడ్డి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని అన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో ఉండాలని డీఈఓ ఆకాంక్షించారు. డీఈఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఏదుళ్ల మధుసూదన్‌రెడ్డి, జ్యోతి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, విద్యాశాఖ ఏడీ రమాచారి, ఏసీజీఈ యూసుఫ్ షరీఫ్, ఏఎంఓ రామచంద్రయ్య, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సత్తెమ్మ, డీసీసీబీ కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్, యేసు ఆదినారాయణ, సూపరింటెండెంట్ మోహన్, మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

- యువకుడిపై కేసు నమోదు

గరిడేపల్లి: బాలికపై యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం బేతవోలుకు చెందిన మహిళను భర్త వదిలిపెట్టడంతో ఆమె తన ఇద్దరు కుమార్తెలతో కలిసి గరిడేపల్లి మండలం కల్మలచెరువులో తల్లిగారింటి వద్ద ఉంటోంది. సదరు మహిళ పెద్ద కుమార్తె మంగళవారం రాత్రి ఇంటి ముందు ఆడుకుంటుండగా కరెంట్ పోయింది. అదే సమయంలో కల్మలచెరువు గ్రామానికే చెందిన అమరవరపు సాయి బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడు. ఇంతలో ఎవరో వచ్చిన అలికిడి కావడంతో ఎవరికైనా చెబితే చంపేస్తానని బాలికను బెదిరించి ఇంటికి పంపించేశాడు. అర్ధరాత్రి బాలిక తన అమ్మమ్మ ఇంట్లో నిద్రించగా.. మళ్లీ ఆ యువకుడు వెళ్లి బాలికను నిద్ర లేపడంతో ఆమె కేకలు వేయడంతో సాయి పరారయ్యాడు. దీంతో బాలిక జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో బుధవారం గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాములునాయక్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నకిరేకల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం తాళ్లవెల్లంలకు ఆవుల కొండయ్య(38) ఈ నెల 28న తన బంధువు ఆవుల ఎల్లేష్‌తో కలిసి బైక్‌పై నకిరేకల్ మండలం చందుపట్లలో తన బంధువుల ఇంటికి వచ్చారు. అదే రోజు సాయంత్రం తిరిగి నల్లగొండకు వెళ్తుండగా.. నకిరేకల్ పట్టణ పరిధిలోని చీమలగడ్డ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొండయ్య, ఎల్లేష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ కొండయ్య బుధవారం మృతి చెందాడు.

సర్వేల్ గురుకులంలో 100శాతం ఉత్తీర్ణత



సంద్ర స్వాతిక్, 555 మార్కులు

సంస్థాన్ నారాయణపురం: సర్వేల్ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులు బుధవారం ప్రకటించిన ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. 85మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 85మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సంద్ర స్వాతిక్ 600 మార్కులకు గాను 555 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలువగా, 540పైగా మార్కులు సాధించిన వారు 15మంది విద్యార్థులున్నారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ అభినందించారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు



ఉత్సవమూర్తులకు పూజలు చేసి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు అభిషేకం చేసి సహస్రనామార్చనతో కొలిచారు. అనంతరం ఆలయ ముఖమండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులకు అష్టోత్తర పూజలు, ముఖ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.